సాక్షి
ప్రకాశం
మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



సంక్షేమ పథకాల అమలు జగనన్నతోనే సాధ్యం

సంక్షేమ పథకాల అమలు జగనన్నతోనే సాధ్యమని కారుమూరి, చెవిరెడ్డి, బూచేపల్లి పేర్కొన్నారు.

- 8లో..



అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

గంజాయి అక్రమ రవాణా, దేవాలయాలు, గృహాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
39 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

28 నుంచి ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సంతనూతలపాడు: విద్యాహక్కు చట్టం 2009, సెక్షన్ 12(1) సి ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి అర్హులైన వారు ఏప్రిల్ 28 నుంచి మే 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ వెబ్‌సైట్ https://cse.ap.gov.in లో వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలో 1వ తరగతిలో ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఐదేళ్ల వయస్సు నిండిన వారికి మాత్రమే 1వ తరగతిలో అడ్మిషన్లు కేటాయిస్తామన్నారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి 2025 మార్చి 31 నాటికి, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి జూన్ 1 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. మే 16 నుంచి 20వ తేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఉన్న డేటాతో పోల్చుకొని అడ్మిషన్లు ఇస్తారన్నారు. ప్రస్తుతం చిరునామా ధ్రువీకరణ కోసం తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డు, ఓటరుకార్డు, భూమి హక్కుల పత్రం, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ జాబ్‌కార్డ్, పాస్‌పోర్ట్, విద్యుత్ బిల్లు, రెంటల్ అగ్రిమెంట్ కాపీ, డ్రైవింగ్ లైసెన్స్, జనన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు సమర్పించాలన్నారు. మొదటి విడత ఫలితాలు మే 21 నుంచి 24వ తేదీల మధ్యలో విడుదల చేస్తారని, సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 25 ప్రకటిస్తారన్నారు. రెండో విడత ఫలితాలు జూన్ 6న విడుదల చేస్తారని, పూర్తి సమాచారం కోసం 180042578599 టోల్ ఫ్రీ నంబర్లో సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ కొత్త డీపీటీఓగా సత్యనారాయణ

ఒంగోలు టౌన్: ఆర్టీసీ నూతన డీపీటీఓగా జి.సత్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన విజయవాడలో వర్క్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2009 నుంచి 2013 వరకు ఆయన ఒంగోలులో డిపో మేనేజర్‌గా పనిచేశారు. ఇక్కడ ఇన్‌చార్జి డీపీటీఓగా పనిచేస్తున్న కె.వెంకటరావును తిరుపతికి బదిలీ చేశారు. వెంకటరావు మార్చి 1వ తేదీ బాధ్యతలు చేపట్టారు. కేవలం రెండు నెలల పాటు ఇక్కడ పనిచేశారు. అలాగే ఏటీఎం కమర్షియల్‌గా పనిచేస్తున్న నవీన్ కుమార్ రిటైర్డ్ కావడంతో కొంతకాలంగా డీఎం శ్రీనివాసులు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడాయన స్థానంలో ఘట్టమనేని శ్రీనివాసరావును ఏటీఎం కమర్షియల్‌గా నియమించారు.


నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని మీ కోసం భవన్‌లో సోమవారం జిల్లా స్థాయి ఉల్లాస్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన సెల్ఫ్ హెల్ప్ గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) సభ్యులను అక్షరాస్యులుగా చేయటానికి ఉల్లాస్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మే 5వ తేదీ నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు వాలంటరీ టీచర్లతో తరగతులు నిర్వహిస్తారని వివరించారు. ఒంగోలు వయోజన విద్య ఉపసంచాలకులు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి 39,763 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులను అక్షరాస్యులుగా చేయడం లక్ష్యమన్నారు. 5 నెలల పాటు అక్షరాస్యతా తరగతులు నిర్వహిస్తారని, అనంతరం సెప్టెంబరు నెలాఖరులో మూల్యాంకన పరీక్షలు ఉంటాయన్నారు.

మత్తు.. భవిత చిత్తు!

జిల్లాను గంజాయి మత్తు కమ్మేస్తోంది. పట్టణం..పల్లె అనే తేడా లేకుండా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. చిల్లర కొట్లు..కాలేజీల పరిసరాల్లో సులువుగా లభ్యమవుతోంది. జిల్లా కేంద్రం మొదలు పశ్చిమ ప్రకాశం అంతటా అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలు, బీఈడీ, డిగ్రీ, ఇంటర్మీడియెట్ కళాశాల విద్యార్థులే టార్గెట్‌గా దీనిని విక్రయిస్తున్నట్టు సమాచారం. పోలీసులు దాడులు చేస్తున్నా విక్రయాలు మాత్రం ఆగడంలేదు. కొంతమంది పోలీసులు నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



- జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- ఇంజినీరింగ్, మెడికల్, ఇంటర్ విద్యార్థుల టార్గెట్‌గా అమ్మకాలు
- పశ్చిమ ప్రకాశంలో గంజాయి జోరు
- సెలవు రోజుల్లో బీచుల్లో విక్రయం
- కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- ప్రత్యేక నిఘా పెట్టామంటున్న ఎస్పీ దామోదర్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు, ఒంగోలు టౌన్: గంజాయి అమ్మకాలకు జిల్లా అడ్డాగా మారుతోంది. గతంలో పట్టణాల్లో మాత్రమే దొరికే గంజాయి ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి వచ్చింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పుడు గంజాయి దొరకని మండల కేంద్రం లేదు. యువకులు గంజాయికి అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. గంజాయికి బానిసలైన యువకులు చేతిలో డబ్బులు లేక దొంగతనాలకు వెనుకాడడం లేదు. జైలుపాలై కన్నవారికి కడగండ్లు మిగిల్చుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు కొండపి, యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు, దర్శి, కనిగిరి నియోజకవర్గాల పరిధిలో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ నెల 9వ తేదీ మార్కాపురంలోని ఎస్టేట్ ఏరియాలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పది రోజుల వ్యవధిలో ఒడిశాకు చెందిన అంతర్ రాష్ట్ర గంజాయి ముఠాను అరెస్టు చేశారు. రైల్వే బ్రిడ్జి కింద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేశారు. గత నెలలో గిద్దలూరు పట్టణంలో తెలంగాణ నుంచి వచ్చి విక్రయిస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. దర్శి పట్టణంలోని చౌడవరం రోడ్డుతో పాటుగా తూర్పు గంగవరం, ముండ్లమూరు, కురిచేడు, దొనకొండ మండలాల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. దొనకొండలో రైలు మార్గంగుండా గంజాయి సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. యర్రగొండపాలెంలో ఊరి బయట ఉన్న ఒక సినిమా హాలు పరిసరాల్లో, తిరుమల నగరి కాలనీతో పాటుగా కొలుకుల, వీరభద్రాపురం, త్రిపురాంతకం మండలంలోని నడిగడ్డ తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. 6 నెలల క్రితం యర్రగొండపాలెంలో గంజాయి కేసులో ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. గతంలో కూడా ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ పేరుతో యర్రగొండపాలెం, త్రిపురాంతకం, దోర్నాల పోలీసు స్టేషన్లకు తిప్పినట్లు తెలుస్తోంది. ఎక్కువగా 15 నుంచి 20 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులు గంజాయి బారిన పడుతుండటంపై సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి అరెస్టుతో కలకలం..

ఇటీవల టంగుటూరు పరిధిలో గంజాయి విక్రయాలతో సంబంధం ఉన్న ఒక ఇంజినీరింగ్ విద్యార్థిని అరెస్టు చేయడం కలకలం సృష్టించింది. వల్లూరు సమీపంలోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థి వైజాగ్ నుంచి 5 కిలోల గంజాయి తీసుకొచ్చి హాస్టల్‌లో ఉంచి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని జైలుకు పంపించారు.

గంజాయి మత్తులో రోడ్డు ప్రమాదాలు:

ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో గంజాయి ప్రభావం కనిపిస్తోంది. అనేక మంది యువకులు గంజాయి తాగిన మత్తులో వేగంగా వాహనాలు నడపడం, ప్రమాదాలు జరగడం నిత్యకృత్యమైపోయింది. అర్ధరాత్రిళ్లు రోడ్డు మీదకు వచ్చి వేగంగా వాహనాలు నడుపుతూ అదుపుతప్పి పడిపోతున్నారు. ప్రాణాలు పోగొట్టుకుని తల్లిదండ్రులకు కన్నీరు మిగుల్చుతున్నారు. కనిగిరి మండలంలో గతంలో ఇలాంటి ఘటనలు జరిగాయి.

బీచుల్లో జోరుగా విక్రయాలు

జిల్లాలో కొత్తపట్నం, పాకల, కరేడు, ఈతముక్కలలో బీచ్లు, మల్లవరం డ్యామ్ ఉన్నాయి. శని, ఆదివారాలు వస్తే చాలు జిల్లాలో ఉన్న బీచుల్లో యువత సందడి కనిపిస్తుంది. దూర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడకు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అయితే బీచ్‌లకు వచ్చే యువతీ యువకులను టార్గెట్ చేసుకొని కొందరు గంజాయి విక్రయిస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. మెరైన్ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

రాత్రి ప్రయాణాల్లో గంజాయి గొడవ...

జిల్లా కేంద్రమైన ఒంగోలు నుంచి చుట్టు పక్కల గ్రామాలకు, పట్టణాలకు రైలు, బస్సు సౌకర్యాలు ఉన్నాయి. ఒంగోలు సమీప గ్రామాలకు నైట్ హాల్ట్ బస్సులు వెళుతుంటాయి. వినుకొండ, నరసరావుపేట, అద్దంకి, నెల్లూరు నుంచి కూడా నైట్ హాల్ట్ బస్సులు ఒంగోలుకు వస్తుంటాయి. ఇక ఒంగోలు మీదుగా రోజుకు వందకు పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. బస్సులు, రైళ్లలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. అంతే కాకుండా రాత్రి పూట ప్రయాణాల్లో గంజాయి, మద్యం తాగిన వారు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఒక్కోసారి ఒంటరి మహిళలు కనిపిస్తే చాలు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. మార్కాపురం నుంచి ఒంగోలు వస్తున్న ఒక ఎక్స్‌ప్రెస్ బస్సులో ఎక్కిన వ్యక్తి గంజాయి మత్తులో ఒక మహిళ పక్కన కూర్చొని అసభ్యంగా ప్రవర్తించాడు. కండక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

గంజాయిపై ఉక్కుపాదం..



పట్టణాల్లో గంజాయి సేవిస్తున్న వారిపై నిఘా ఉంచాం. వారి ద్వారా సరఫరాదారుల వివరాలు సేకరిస్తున్నాం. గంజాయికి సంబంధించి పాత కేసులు ఉన్న వారిని పిలిపించి వివరాలు సేకరిస్తున్నాం. డాగ్ స్క్వాడ్‌లతో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం. గంజాయికి బానిసలు కావొద్దు..జీవితాలు నాశనం చేసుకోవద్దు అంటూ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ కార్యక్రమాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను సైతం భాగస్వాములను చేస్తున్నాం.

– ఏఆర్ దామోదర్, ఎస్పీ

నగరంలో ఎటు చూసినా గంజాయే

జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఎటు చూసినా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. నగర శివారులోని ఇంజినీరింగ్ కాలేజీల పరిసరాల్లో జోరుగా గంజాయి విక్రయిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. టంగుటూరు మండలం ఒంగోలు శివారు ప్రాంతంలోని ఒక దేవాలయం సమీపంలో కూడా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. అలాగే కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలోని రెండు బిల్డింగులను అడ్డాగా చేసుకొని గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. బాపూజీ కాంప్లెక్స్ ఎదురుగా, ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పలు లాడ్జీల్లో కూడా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. ఆర్టీసీ డిపో లోపలకు వెళ్లే దారిలో మొదటి ప్లాట్‌ఫాం వైపు ఉన్న షాపుల్లో కూడా గంజాయి లభ్యమౌతున్నట్లు సమాచారం. చింతల, కొప్పోలు టిడ్కో గృహాల ఎదురుగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి వదిలేశారు. అక్కడ ఖాళీ స్థలంలో గంజాయి తాగడమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం. కమ్మపాలెం ఫ్లై ఓవర్ కింద దశరాజుపల్లికి వెళ్లే దారిలో, అగ్రహారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్ పక్కన, ఎఫ్‌సీఐ గోడౌన్ పరిసరాల్లో, రైలు పేట మొదటి లైనులోని ఒక బీడీ బంకులో, క్లౌవ్ పేట, గోపాల్ నగర్ 4వ లైను ఖాళీ స్థలాల్లో, గోపికృష్ణ థియేటర్ సమీపంలో గంజాయి అమ్మకాలు, సేవించడం జరుగుతున్నట్లు సమాచారం. రైల్వే స్టేషన్ పరిసరాలు, ఆర్టీసీ బస్టాండ్లు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.

కదిలొచ్చిన దేవదేవుడు



రథం వద్ద పూజలు చేస్తున్న అన్నా రాంబాబు



స్వామివారి రథోత్సవం దృశ్యాలు, (ఇన్ సెట్‌లో) చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు

- కన్నుల పండువగా చెన్నకేశవుని రథోత్సవం
- తిలకించిన లక్షలాది మంది భక్తులు

మార్కాపురం టౌన్: స్థానిక లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడైన లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి రథోత్సవం అశేషజనవాహిని మధ్య కన్నుల పండువగా జరిగింది. వేలాదిగా భక్తులు స్వామి వారి రథోత్సవంలో పాల్గొన్నారు. జై చెన్నకేశవా.. జైజై చెన్నకేశవా.. గోవిందా నామస్మరణలతో స్వామి వారిని దర్శించుకుని రథచక్రాలకు టెంకాయలు, గుమ్మడికాయలను కొట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రథం బయలుదేరినప్పటి నుంచి మళ్లీ తిరిగి యథాస్థానం చేరే వరకు భక్తులు పోటీపడి రథాన్ని ముందుకు లాగి తమ భక్తిని చాటుకున్నారు. పట్టణంతో పాటు, వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా పాల్గొని స్వామి వారి రథోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి రథయాత్ర ప్రారంభమై మెయిన్ బజార్, పాత బస్టాండ్, నాయుడు వీధి మీదుగా యథా స్థానానికి చేరింది. సాయంత్రం 5 గంటల నుంచే పట్టణానికి వేలాది మంది భక్తుల రాక మొదలైంది. జెండా ఊపి రథోత్సవాన్ని అధికారులు ప్రారంభించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రథోత్సవం ఏర్పాట్లు జరిగాయి. స్వామివారిని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, సబ్‌కలెక్టర్ త్రివినాగ్, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, సీనియర్ వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి, ఒంగోలు, మార్కాపురం ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, కందుల నారాయణ రెడ్డి, బీజేపీ, జనసేన ఇన్‌చార్జిలు పీవీ కృష్ణారావు, ఇమ్మడి కాశీనాథ్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

భద్రత ఏర్పాట్లు:

పట్టణంలో రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు ఆధ్వర్యంలో సీఐ సుబ్బారావుతోపాటు మరో ఐదుగురు సీఐలు, ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమరావు, అహరోన్‌లతో పాటు 14 మంది ఎస్సైలు, 200 మంది కానిస్టేబుల్స్, స్పెషల్ పార్టీల పోలీసులు భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

- కనిగిరిలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా మహా నిరసన శాంతి ర్యాలీ



పట్టణంలోని శాంతియుతంగా నిరసన ర్యాలీ

కనిగిరిరూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని.. వెంటనే రద్దు చేయాలని పలువురు ముస్లిం నేతలు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లు ను పార్లమెంటులో ఆమోదించడాన్ని నిరసిస్తూ కనిగిరిలో జమియత్ ఏ-ఉలమా, అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కనిగిరిలో మహా నిరసన శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అగ్రభాగాన సుమారు 200 మీటర్ల జాతీయ పతాకాన్ని తీసుకుని ముస్లిం యువత నడిచారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం 2025 ను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. దేశంలో బీజేపీ సర్కార్ ముస్లింలపై కక్ష సాధింపు చర్యలు చేపడుతోందని, అందులో భాగంగానే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. వక్ఫ్ బోర్డులో ఇద్దరు సభ్యులుగా ముస్లిమేతరులను నియమించటం, ఎవరైతే వక్ఫ్ బోర్డుకు తమ ఆస్తులను, ధనాన్ని దానం చేయదల్చారో వారు ఐదేళ్ల పాటు ఇస్లాంను అనుసరిస్తున్నట్లుగా తగిన ఆధారాలు చూపించటం, వక్ఫ్ ఆస్తుల మీద ఏదైనా వివాదాలు వస్తే ట్రిబ్యునల్ కు కలెక్టర్ స్థాయి అధికారిని నియమించటం, రాష్ట్ర బోర్డు అధికారాలను తగ్గించి పూర్తిస్థాయి అధికారాలను కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవడం, ఈ చట్టం అమల్లోకి వచ్చిన రోజు నుంచి ఆరు నెలల్లోపు కేంద్ర ప్రభుత్వానికి వక్ఫ్ బోర్డు సంబంధిత పత్రాలు సమర్పించకపోతే ఆ ఆస్తులన్నీ ప్రభుత్వ ఆస్తులుగా పరిగణించటం, వక్ఫ్ పరిరక్షణ లో పారదర్శకత లేదని కలెక్టర్లకు పూర్తి బాధ్యత కల్పించటం, తదితర అంశాలతో ప్రభుత్వ జోక్యం కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ముస్లిం ధార్మిక విషయాల్లో జోక్యం చేసుకొని తప్పుడు ఆలోచన విధానంతో ఈ అమెండ్మెంట్ చట్టం ను తీసుకొచ్చిందని తీవ్రంగా ఎండగట్టారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ అధ్యక్షుడు ఎస్ అహమ్మద్ హుస్సేనీ, మాజీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు రోషన్ సందాని, ముఫ్తీలు, మౌలానాలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్రం వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీ స్థానిక షాదీ ఖానా వద్ద నుంచి ఎమ్మెస్సార్ రోడ్డు, వైఎస్సార్ రోడ్డు, పామూరు బస్టాండ్ వరకు సాగింది. అనంతరం వివిధ డిమాండ్‌లతో వినతి పత్రాన్ని ఆర్డీఓ జీ కేశవర్ధన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో జమియత్ ఉలమా, అంజుమన్ ఏ కమిటీ ఇస్లామియా కమిటీ, వివిధ సంఘాల నాయకులు ఎస్డీ షాహిద్, ఎస్కే డాక్టర్ రసూల్, ఎస్కే ఖాజా, ఎస్కే జంషీర్ అహమ్మద్, గుడిపాటి ఖాదర్, ఎస్కే ఫిరోజ్, ఎస్కే మస్తాన్‌వలి, ముస్తాఫా, పీసీ కేవవులు, మీరావలి, నాయబ్ రసూల్, రహీంబాషా, ఆరీఫ్, ముస్లిం యూత్, వివిధ మసీద్ కమిటీల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చలేనన్న ఏకైక సీఎం చంద్రబాబు

- దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కారుమూరి, తాటిపర్తి

యర్రగొండపాలెం: ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు అనేక హామీలు ఇచ్చాడని, అధికారంలోకి వచ్చాక ఈ సూపర్ సిక్స్ నేను చేయలేను, నాకు చేతకాదని చెప్పిన ఒకే ఒక ముఖ్యమంత్రి చంద్రబాబేనని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. త్రిపురాంతకం ఎంపీపీగా అల్ల సుబ్బమ్మ అంజనేయరెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవంలో సోమవారం ఆయన మాట్లాడారు. శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. మన నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని కష్టాలు వచ్చినా ఇచ్చిన హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. మనందరి లక్ష్యం ఒక్కటేనని, 2029లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవటం, ఎమ్మెల్యే తాటిపర్తిని మళ్లీ 30 వేల మెజార్టీతో గెలిపించడమేనని, మేము ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటామని అన్నారు.

సభకు అధ్యక్షత వహించిన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో టీడీపీకి ఏ మాత్రం అభిమానం లేకపోయినా అధికారం ఉందన్న అహంకారంతో ఎంపీపీ పీఠాన్ని అధిష్ఠించాలనుకొని చతికిల పడ్డారని అన్నారు. ఒక ఎంపీటీసీ అల్ల ఆంజనేయరెడ్డిని జైల్లో పెట్టించి, ఇంకొక ఎంపీటీసీ కృష్ణను ఇంట్లో అరెస్ట్ చేసి, మరొక ఎంపీటీసీ సృజనను తీసుకొనివెళ్లి వాళ్ల ఇంట్లోనే పెట్టుకొని ఎన్నో కుయుక్తులు పన్నారని అన్నారు. మండల పరిషత్‌లో సాధించిన విజయాన్ని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకోవాలని, వైఎస్సార్ సీపీ జెండా మనకు అండగా ఉందని గ్రామాల్లో తెలపాలన్నారు. విశాఖలో అత్యంత ఖరీదైన భూమి మాత్రం ఎకరా 99 పైసలు, క్వార్టర్ మద్యం బాటిల్ మాత్రం రూ.99 అని.. ఇది చేతకాని దద్దమ్మ ప్రభుత్వం చేసే పని అన్నారు. ఇక్కడ గెలిచిన ఎంపీపీలకు, ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు సంబంధం లేకుండా, తీర్మానాలు లేకుండా పనులు చేసుకుంటూ పోతూ ఉంటే తాము ఊరుకునే ప్రసక్తేలేదని, దెబ్బకు దెబ్బ తీస్తామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ కార్యకర్తలతోనే పార్టీ నడుస్తుందని, అటువంటి కార్యకర్తలకు జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పేదలకు ఏ ఒక్క పథకం అందడం లేదని, రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నూతనంగా ఎంపికైన ఎంపీపీ అల్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, కార్యదర్శి కె.ఓబులరెడ్డి, వైపాలెం ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీలు యేర్వ చలమారెడ్డి, వాగ్యా నాయక్, పార్టీ మండల కన్వీనర్లు ఏకుల ముసలారెడ్డి, పి.కృష్ణారెడ్డి, జి.వెంకట రమణారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, బూత్ కన్వీనర్ల నియోజకవర్గ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి

ఎంపీపీ అల్ల సుబ్బమ్మను అభినందించిన కారుమూరి, చెవిరెడ్డి

త్రిపురాంతకం ఎంపీపీగా పదవీ స్వీకారం చేస్తున్న అల్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డిని సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభినందించారు. వారితోపాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, దర్శి ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు సుబ్బమ్మతో పాటు ఎన్నికల సమయంలో కీలకంగా వ్యవహరించిన ఎంపీటీసీ సభ్యులు సృజన, కృష్ణలను వారు అభినందించారు. ముందుగా బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తనను అభినందించటానికి తమ ఇంటి వద్దకు వచ్చిన వారికి సుబ్బమ్మ శాలువకప్పి ఘనంగా సన్మానించారు.



ఎంపీపీ సుబ్బమ్మ, ఆంజనేయరెడ్డిలను సన్మానిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

క్లుప్తంగా

గడియార స్తంభం తొలగించొద్దు

- కలెక్టర్‌కు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి(కురిచేడు): దర్శికి తలమానికంగా ఉన్న గడియార స్తంభాన్ని తొలగించవద్దని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2001లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గడియార స్తంభాన్ని ఏర్పాటు చేశారని, అప్పటి పంచాయతీ అధికారులు, రోడ్లు భవనాల శాఖాధికారుల అనుమతి తీసుకొని నిర్మించిన ఈ రోటరీ గడియార స్తంభం దర్శికి తలమానికంగా నిలిచిందన్నారు. పాతికేళ్ల గొప్పచరిత్ర కలిగిన గడియార స్తంభాన్ని ఇప్పటి కప్పుడు ఆకస్మాత్తుగా తొలగించడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. అకారణంగా గడియార స్తంభం తొలగిస్తే దర్శి ప్రజల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. గడియార స్తంభాన్ని యథాస్థితిలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురం టౌన్: మానసిక, అనారోగ్య సమస్యలతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పట్టణంలోని జగదీశ్వరీ థియేటర్ రోడ్డు బాలగురవారెడ్డి బజారులో జరిగింది. కాలనీలో నివాసం ఉండే సింగరి కాశీరావు (52) కొంత కాలంగా మానసిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సౌజన్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మార్కాపురం: రథోత్సవం సందర్భంగా స్వామిని చూసేందుకు వచ్చిన మహిళ మెడలో గొలుసు చోరీకి గురైంది. ఈ మేరకు పట్టణ పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళితే..మార్కాపురం మండలం చింతగుంట్ల గ్రామానికి చెందిన కాశంగి బాలరాజు భార్య కాశంగి వెంకట పిచ్చమ్మ చెన్నకేశవస్వామి వారి రథోత్సవాన్ని తిలకించేందుకు రథం వద్దకు వచ్చి టెంకాయ కొట్టి బయటకు వచ్చి చూసుకోగా మెడలో మూడు తులాల గొలుసు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై లాఠీచార్జి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అర్బన్ కాలనీలో నివాసం ఉంటున్న ధనరాజ్, రాముడు ఇరువర్గాలకు చెందిన వారు గత రెండు రోజుల క్రితం ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్నారు. గాయాలపాలై గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులు సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ కె.సురేష్ సిబ్బందితో లాఠీచార్జి చేసి ఘర్షణను అదుపులోకి తీసుకువచ్చారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు.

సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పక్కన కారుమూరి నాగేశ్వరరావు, సురేష్, చంద్రశేఖర్, జంకె, అన్నా తదితరులు



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన వెంకాయమ్మ, రాంబాబు తదితరులు

- అందరం సమష్టిగా మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందాం
- 10 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- ఒక్క హామీనైనా అమలు చేశారా..?
- పార్టీ నేతలు కారుమూరి, చెవిరెడ్డి, బూచేపల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, అన్నా, సురేష్, చంద్రశేఖర్

మార్కాపురం: ఇచ్చిన మాటకు కట్టుబడి పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడం జగనన్నకే సాధ్యమని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ మంత్రి సురేష్ అన్నారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పట్టణంలోని అమ్మవారిశాల బజారులో వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభపై ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మళ్లీ సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే జగనన్నే సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రతి నెలా ఒక ఇంటికి వెళ్లి పరామర్శించి వారికి ఇల్లు మంజూరు చేస్తే ప్రజలందరికీ ఇళ్లు ఇచ్చినట్టేనా అని నాగేశ్వరరావు ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనసుతో కుల, మత, ప్రాంత, పార్టీలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలు, పోర్టులు నిర్మిస్తే వాటిని ప్రైవేట్‌పరం చేయాలని చంద్రబాబు చూస్తున్నారన్నారు. ఏ సీఎం అయినా రాష్ట్రానికి మెడికల్ సీట్లు కావాలని కేంద్రాన్ని కోరతారని, మన రాష్ట్రానికి 750 మెడికల్ సీట్లు వస్తే చంద్రబాబు వెనక్కి పంపారన్నారు.

ప్రజలు కాదు..ఈవీఎంలే ఓడించాయి.

వైఎస్సార్ సీపీ ప్రజాక్షేత్రంలో ప్రజలు ఓడించలేదని, ఈవీఎంలే ఓడించాయని పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. కేవలం 10 నెలల కాలంలోనే ప్రభుత్వంపై ఎంతో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇంత రాత్రయినా కూడా ఇన్ని వేల మంది ప్రజలున్నారంటే వైఎస్సార్ సీపీపై ఎంతటి అభిమానం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. నేను గెలిచినా.. ఓడినా మీ మధ్యనే ఉంటా.. మీ ఆత్మీయతను అభిమానాన్ని స్వీకరిస్తా. వచ్చే ఎన్నికల్లో జగనన్నను సీఎంగా గెలిపించుకుందామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలు మళ్లీ అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామన్నారు. మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 10 నెలల పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, ప్రాంతం చూడకుండా అభివృద్ధి పనులు చేస్తే కూటమి నేతలు మాత్రం వైఎస్సార్ సీపీ వారికి పనులు చేయమని చెప్పారన్నారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోట్ల విలువైన భూమిని 99 పైసలకు ప్రభుత్వం ఇస్తోందని, అదే క్వార్టర్ బాటిల్‌ను రూ.99లకు అమ్ముతోందన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తానని, మార్కాపురం జిల్లా చేస్తామని హామీఇచ్చి 10 నెలలు కావస్తున్నా ఇంత వరకూ అమలు కాలేదన్నారు. సంక్షేమ పథకాలన్నీ ఆగిపోయాయనని, ప్రజలు కష్టాలు పడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు మాట్లాడుతూ తాను గెలిచినా.. ఓడినా.. ప్రజల మధ్యనే ఉంటానని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, అన్నా కృష్ణచైతన్య, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్న హనుమారెడ్డి, మార్కాపురం, కొనకనమిట్ల, తర్లుపాడు జెడ్పీటీసీలు నారు బాపన్‌రెడ్డి, ఏడుకొండలు, ఇందిర, ఎంపీపీలు లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మురళీకృష్ణ యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వైవీరావు, పీఎల్‌పి యాదవ్, కౌన్సిలర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లాల దొంగలు అరెస్టు

- దేవాలయాలే లక్ష్యంగా చోరీలు
- నలుగురు నిందితులు అరెస్టు
- గంజాయి రవాణాలో సిద్ధహస్తులు
- రూ.10 లక్షల చోరీ సొత్తు, నాలుగున్నర కేజీల గంజాయి స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన సీఐ హజరత్తయ్య



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: గంజాయి అక్రమ రవాణాతో పాటు దేవాలయాలు, గృహాలే లక్ష్యంగా చోరీకి పాల్పడుతూ జిల్లాలో సుమారు 70 దొంగతనాలకు పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10 లక్షల సొత్తు, నాలుగున్నర కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ హజరత్తయ్య వివరాలు వెల్లడించారు. పేర్నమిట్టకు చెందిన చిడితోటి మధుబాబు, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం రాకూరి దుర్గారావు, గుంటూరు జిల్లా లాలాపేట ఏరియాలోని పట్నం బజారులో నివసిస్తున్న తెలంగాణ రాష్ట్రం యాదగిరి గుట్ట మండలం యదగిరిపల్లి గ్రామానికి చెందిన పత్తి రవి, సింగరాయకొండ మండలం గుజ్జల యలమందారెడ్డినగర్‌కు చెందిన కుంచాల గురవమ్మలను అదుపులోకి తీసుకున్నామన్నారు. మధుబాబుపై తాళ్లూరు పోలీసుస్టేషన్లో మూడు, జరుగుమల్లిలో రెండు, అద్దంకిలో ఒకటి, నాగులుప్పలపాడులో రెండు, పొదిలిలో ఒకటి, వినుకొండలో ఒకటి, కందుకూరు రూరల్‌లో ఒక కేసు ఉన్నాయి.

రాకూరి దుర్గారావుపై తాళ్లూరులో రెండు, కందుకూరు రూరల్‌లో ఒక కేసు, పత్తి రవికి మద్దిపాడులో ఒకటి, సింగరాయకొండలో రెండు కేసులు ఉన్నాయన్నారు. మధుబాబు అంతర్‌జిల్లాల్లో సుమారు 70 వరకు చోరీలకు పాల్పడ్డాడన్నారు. ముఖ్యంగా దేవాలయాలే లక్ష్యంగా చోరీకి పాల్పడి ఆలయంలో ఉన్న గంట, ఇత్తడి సామాను, విగ్రహాలు, దేవుని మండపం, శిలాతోరణాలు ఇలా ఏ వస్తువుని వదలకుండా చోరీ చేసేవాడన్నారు. ఇళ్లలోకి చోరీకి వచ్చినప్పుడు బంగారం, వెండి వస్తువులతో పాటు విలువైన ఫర్నీచర్, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా చోరీ చేస్తాడని వివరించారు. ఈ కేసులో అరెస్టు అయిన నలుగురిలో ఒకరైన వృద్ధురాలు కుంచాల గురవమ్మ పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో శనక్కాయలు అమ్ముకుంటూ జీవించేది. శనక్కాయల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవటంతో రైలులో రాజమండ్రి వెళ్లి గంజాయి కేజీ రూ.1,500 కొనుగోలు చేసి ఇక్కడ రూ.5 వేలకు విక్రయిస్తుందని తెలిపారు. వృద్ధురాలి వద్ద మధుబాబు, దుర్గారావు, రవికుమార్‌లు కేజీ గంజాయి రూ.5 వేల కొనుగోలు చేసి విక్రయించేవారు. సోమవారం వీరు ముగ్గురు గురవమ్మ వద్దకు వచ్చి గంజాయి కొనుక్కొని వెళుతుండగా వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ హజరత్తయ్య వివరించారు. కేసులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, సిబ్బందిని ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.



పొగాకు బోర్డు వద్ద మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

పొగాకు రైతులను ఆదుకోవాలి

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు డిమాండ్

ఒంగోలు టౌన్: మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి పొగాకు రైతులను ఆదుకోవాలని, లేకుంటే పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన త్రోవగుంట వద్ద ఉన్న పొగాకు బోర్డు వేలం కేంద్రాన్ని పార్టీ నాయకులు, పొగాకు రైతులతో కలిసి సందర్శించి అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో మాదిరిగానే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకుంటే పొగాకు రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడి వచ్చిందని ధరలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. మన రాష్ట్రంలో అధిక వర్షాలతో ఒకటికి రెండు సార్లు నాట్లు వేశారని, కలుపు పెరగడం, మళ్లె వేయడం వల్ల దిగుబడి తక్కువగా వచ్చిందన్నారు. పంట ఖర్చులు పెరిగాయని, కూలి రేట్లు కూడా పెరిగాయని రైతులు చాలా నష్టపోయారని వివరించారు. ఎక్కువ మంది బీసీలు, ఎస్సీలు, నిరుపేద రైతులు అధిక కౌలుకు బ్యార్నీలు తీసుకొని పంట వేశారని, ప్రస్తుత మార్కెట్ మాయాజాలంలో నెగ్గుకురాలేక కంట కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017-18లో నాటి తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో కూడా ఇలాగే జరగడంతో అనేక మంది పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడాన్ని ఆయన గుర్తు చేశారు. నాడు ఆత్మహత్య చేసుకున్న రైతుల మృతదేహాలను పొగాకు బోర్డు వద్ద పెట్టి రైతులు ఆందోళనకు దిగారని, రైతులకు మద్దతుగా నిలబడి ప్రశ్నించిన వారిపై పోలీసు కేసులు పెట్టి వేధించారని చెప్పారు. తిరిగి ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతులకు నాటి పరిస్థితే పునరావృతమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు కొనుగోలు చేస్తేనే రైతులు నష్టాల ఊబి నుంచి బయట పడతారని చెప్పారు. పొగాకు రైతులు తొందరపడి తక్కువ ధరలకు పంటను అమ్ముకోవద్దన్నారు. అవసరమైతే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతులకు అండగా వచ్చి నిలబడతారని తెలిపారు. త్వరలోనే రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పొగాకు బోర్డును సందర్శించి రైతులతో మాట్లాడతారని తెలిపారు. పొగాకు రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ధరల కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకురావాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాసరావు, నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, మద్దిపాడు మండల ఉపాధ్యక్షుడు కోటిరెడ్డి, పలువురు ఎంపీపీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అర్జీలను కూడా పరిశీలించాలి

- గడువులోగా అర్జీలను పరిష్కరించాలి
- మీ కోసంలో అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ఆన్‌లైన్‌లో వచ్చే అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో మీ కోసం భవన్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలన్నారు. సాంకేతిక సమస్యల వలన క్షేత్ర స్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. మీ కోసం కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిల్లో అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని స్పష్టం చేశారు. వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. 'మీ కోసం' కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నందున ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ బి.చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, వరకుమార్, డిప్యూటీ కలెక్టర్ పార్థసారథితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

పామూరు: బీరువాలో దాచిన నగదు చెప్పకుండా ఖర్చు పెట్టాడని తల్లిదండ్రులు మందలించగా మనస్తాపానికి గురైన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన స్థానిక రాచూరివారివీధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పామూరు రాచూరివారి వీధిలో బచ్చు లీలాకృష్ణ, ట్యూషన్లు మ్యాచింగ్ సెంటర్ నిర్వహిస్తూ పిల్లలను చదివిస్తున్నారు. లీలాకృష్ణ రూ.25 వేల నగదును ఇంట్లోని బీరువాలో భద్రపరిచాడు. సోమవారం నగదును బ్యాంకులో వేసేందుకు చూడగా లేకపోవడంతో భార్యని అడిగాడు. ఆమె తీయలేదని చెప్పగా నగదును కుమారుడు బచ్చు బాల భవేష్ ఖర్చుల కోసం తీశానని తల్లిదండ్రులకు చెప్పి, మిగిలి ఉన్న రూ.11 వేల నగదును తిరిగి ఇచ్చాడు. చెప్పకుండా నగదు ఎందుకు ఖర్చు పెట్టావని తల్లిదండ్రులు మందించి తిరిగి దుకాణానికి వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికి వెళ్లి తలుపులు తీయగా అప్పటికే బాల భవేష్ (17) ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి లీలాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గోనె శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ శాంతియుత ర్యాలీ



కంభంలో వక్ఫ్‌సవరణ చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ముస్లింలు



వైపాలెంలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

కంభం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఉదయం కంభం పట్టణంలో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. స్థానిక జామియా మసీదు వద్ద నుంచి ముస్లింలు జాతీయ జెండాలు, ప్లకార్డులు చేతపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. జామియా మసీదు సెంటర్ నుంచి సర్కిల్ కార్యాలయం, చౌక్‌సెంటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా కందులాపురం కూడలి వరకు ర్యాలీ సాగింది. కందులాపురం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి వక్ఫ్‌సవరణ చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు.

శాంతిర్యాలికి ప్రజాసంఘాల సంఘీభావం

ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతిర్యాలీకి ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, పీఏఎఫ్, సీఐటీయూ కమ్యూనిస్టు పార్టీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీయస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి షాలెం రాజు మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు పూర్తిగా ముస్లింలకు సంబంధించినవేనని, అందులో ఏమైనా ఇబ్బందులు ఉంటే ముస్లిం మత పెద్దలు పరిష్కరించుకుంటారన్నారు. టీటీడీ, ఇతర కమిటీల్లో ముస్లింలకు స్థానం కల్పించనప్పుడు పూర్తిగా ముస్లింలకు సంబంధించిన వక్ఫ్‌లో ముస్లింమేతరులకు ఎలా అధికారాలు కట్టబెడతారని ప్రశ్నించారు. వెంటనే వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు జయరాజ్, అన్వర్, ఇబ్రహీం, అబ్రహం, ముస్లిం పెద్దలు ప్రభుత్వ హాజీ ఆరీఫ్, ముఫ్తీ యాసీన్, కలాం, సయ్యద్ జాకీర్ హుస్సేన్, డిష్మున్నా, సయ్యద్ ఖాసిం, సయ్యద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ముస్లింలు పెద్ద ఎత్తున్న శాంతియుత ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రాంతాలు, మసీదుల నుంచి వచ్చిన ముస్లింలు స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని నూరాని మజీద్ వద్దకు చేరుకున్నారు. కొంతమంది జాతీయ పతాకాలు, మరి కొంతమంది చట్టానికి వ్యతిరేకంగా నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించి మార్కాపురం-మాచర్ల రోడ్డులో కదం తొక్కారు. వక్ఫ్‌ను కాపాడండి, రాజ్యాంగాన్ని కాపాడండి, ప్రజా స్వామ్యాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ముస్లిం పెద్దలు, మౌలానాలు హిదాయతుల్లా, మహమ్మద్ ఉసేన్, యునిస్, జుబేర్, షేక్ జిలాని, సయ్యద్ షాబీర్, సయ్యద్ జబీవుల్లా, ఎం.కరీముల్లా బేగ్, షేక్ ఇస్మాయిల్, అమానుల్లాబేగ్, ఫజుల్, రఫీ, మస్తాన్‌వలి, షేక్ కాశింపీరా, షేక్ వలి, మహమ్మద్ కాశిం, కాశింబాష పాల్గొన్నారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన పెంచండి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: మన మిత్ర పేరుతో ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్, శక్తి యాప్‌లను పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్, శక్తి యాప్ అవగాహన కార్యక్రమాలు, జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, మిస్సింగ్ సిటిజన్స్ మ్యాపింగ్, పంచాయతీల్లో పారిశుధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏపీఓలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు పని దినాలు కల్పించాలన్నారు. ఆదివారం జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు విద్యార్థులు మరణించడం బాధాకరమన్నారు. వర్షాకాలంలో ముఖ్యంగా మెరుపులు, పిడుగులు పడే అవకాశం ఉన్న సమయంలో ఏ..ఏ జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీపీఓ వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు పాల్గొన్నారు.